32 పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాకు మంజూరైన నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలో 32 పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిక వెబ్‌సైట్‌తో పాటు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 6 నుంచి 8 వరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు మేడ్చల్ కలెక్టరేట్ భవన సముదాయాల్లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు. దరఖాస్తుతో మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పేరుతో తీసిన రూ.500 డీడీని జత చేయాలన్నారు. అవసరమైన బోనాఫైడ్ సర్టిఫికెట్లు, విద్యార్హతలు/కుల ధృవీకరణ పత్రాల కాపీలను జత పరచాలని కోరారు.

దివ్యాంగులకు వీల్‌చైర్స్ పంపిణీ



వీల్‌చైర్స్ పంపిణీ చేస్తున్న మెరుగు శివకృష్ణ, కిరణ్ తదితరులు

జవహర్‌నగర్: దివ్యాంగుల హక్కుల సాధన సమితి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మెరుగు శివకృష్ణ ఆధ్వర్యంలో సేవా భారతి ట్రస్ట్ సహకారంతో జవహర్‌నగర్ వికలాంగుల కాలనీకి చెందిన నిరుపేద దివ్యాంగులకు శుక్రవారం వీల్‌చైర్స్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దివ్యాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తికొండ కిరణ్ హాజరై వీల్స్ చైర్స్ పంపిణీని ప్రారంభించారు. శివకృష్ణ మాట్లాడుతూ.. దివ్యాంగులకు ప్రభుత్వం సమాన అవకాశాలు, హక్కులు కల్పించి సమసమాజ స్థాపనలో భాగస్వామ్యం చేయాలన్నారు. దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. సేవా భారతి ట్రస్ట్ ఆర్గనైజర్ చెరిపల్లి గౌతమ్, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల బోధనపై ఉపాధ్యాయులకు సదస్సు

ఘట్‌కేసర్: ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులకు బోధన పద్ధతులపై వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రెండు రోజుల సదస్సు నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి. 'ఎన్‌హాన్సింగ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ స్కిల్స్ ఫర్ స్కూల్ టీచర్స్' అంశంపై ఈనెల 29, 30 తేదీల్లో ఉచితంగా శిక్షణ అందజేస్తామని, ఆసక్తి గల ఉపాధ్యాయులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

బీజేపీలో చేరిన డబీల్‌పూర్ నాయకులు



ఈటల సమక్షంలో బీజేపీలో చేరుతున్న డబీల్‌పూర్ యువకులు

మేడ్చల్: మండలంలోని డబీల్‌పూర్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు, యువకులు బీజేపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంట్లో చోరీ

బంజారాహిల్స్: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన జుబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... జూబ్లీహిల్స్ హైలన్ కాలనీ బిల్డింగ్ నం 94లోని ఫ్లాట్ నం 303లో నివాసం ఉండే పామర్తి నాగేంద్ర ఓ ఐటీ కంపెనీలో ఉద్యోగం చేస్తుంటాడు. గురువారం అర్ధరాత్రి 11 గంటల సమయలో ఆఫీస్‌కు వెళ్లాడు. తిరిగి శుక్రవారం తెల్లవారుజాము 3 గంటలకు ఇంటికి వచ్చాడు. ఇంటి తాళం లేకపోవడంతో లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో దొంగతనం జరిగిందని తెలుసుకున్నాడు. ఇంట్లో బీరువాలో ఉన్న 56 గ్రాముల (ఐదున్నర తులాల) బంగారు ఆభరణాలు, 4 గ్రాముల వెండి, రూ. 73 వేల నగదు చోరీకి గురైనట్లు నాగేంద్ర జుబ్లీహిల్స్ పోలీసులకు పిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

చిక్కడపల్లితో శాంతిస్వరూప్‌కు విడదీయని అనుబంధం

చిక్కడపల్లి: దూరదర్శన్ తొలితరం న్యూస్ రీడర్ శాంతిస్వరూప్ చిక్కడపల్లితో విడదీయరాని అనుబంధం ఉంది. 1980 దశకం ప్రాంతంలో ఆయన దాదాపు 30 ఏళ్ల చిక్కడపల్లిలోని తమ సొంతింట్లోనే ఉండేవారు. ఆయన విద్యాభ్యాసం కూడా ఇక్కడే ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాల ఆంధ్రా విద్యాలయంలో జరిగినట్లు తెలుస్తోంది. దాదాపు 2000 సంవత్సరం వరకు ఆయన చిక్కడపల్లిలోనే నివసించి అనంతరం రామాంతపూర్‌కు తరలివెళ్లారని స్థానికులు చెబుతున్నారు. ఆయన ఇటీవలి వరకు త్యాగరాయగానసభ సిటీ సెంట్రల్ లైబ్రరీలో జరిగే పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని సభకు అధ్యక్షత వహించి సభికులు, ప్రేక్షకులు, తోటి వేదికపైన ఉండే పెద్దలను కూడా ఆకట్టుకునేవారు.

సికింద్రాబాద్ జిల్లా కోసం పూజలు

ఉస్మానియా యూనివర్సిటీ: సికింద్రాబాద్ జిల్లాను ఏర్పాటు చేయాలని శ్రీ ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం సికింద్రాబాద్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు. సికింద్రాబాద్‌లోని 7 అసెంబ్లీ నియోజక వర్గాలు త్వరితగతిన అభివృద్ధి చెందాలంటే జిల్లాను ఏర్పాటు చేయాలన్నారు. సికింద్రాబాద్‌ను జిల్లాగా ప్రకటిస్తే 1,116 కొబ్బరికాయాలను కొట్టి మొక్కుతీర్చుకుంటామని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. బాల్‌రాజ్‌యాదవ్, శైలేందర్, కృష్ణ ముదిరాజ్, అశోక్, శ్రీకాంత్‌రెడ్డి, సునీల్ పాల్గొన్నారు.

టీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉదయశ్రీ

కాచిగూడ: ప్రముఖ విద్యావేత్త ఉదయశ్రీరెడ్డిని తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ (టీసీసీ) రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా నియమించినట్లు కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్‌ముదిరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం బర్కత్‌పురలోని టీసీసీ కార్యాలయంలో ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఉదయశ్రీరెడ్డి ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 20 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణ, శాంతి, మతసామరస్యం, కేన్సర్, క్షయవ్యాధి నివారణ, గుండె జబ్బులు, చక్కెర వ్యాధి, హైపర్ టెన్షన్, జాతీయ సమైక్యత, విద్యార్థిని మహిళా సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు.

ప్రకృతి వనాల సంరక్షణేదీ..?

మండుటెండల్లో నీరు లేక ఎండుతున్న మొక్కలు

- మేడ్చల్ జిల్లాలో 396 పల్లె, పట్టణ ప్రకృతి వనాలు
- హరితహారం మొక్కల సంరక్షణలోనూ అంతే..
- అధికారులు దృష్టి సారించాలంటున్న ప్రజలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: పల్లెలు, పట్టణాలు పచ్చదనంతో కళకళలాడాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పల్లె, పట్టణ ప్రకృతి వనాలు, పార్కులకు సంరక్షణ కరువైంది. పలుచోట్ల నిర్వహణ లేక ఎండిపోతున్నాయి. ప్రతి సంవత్సరం గ్రీన్ బడ్జెట్ కింద నిధులు వెచ్చిస్తున్నా.. ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. దీనికి పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల నిర్లక్ష్యమే కారణమన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీనికి తోడు పలు గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న కార్మికులు ప్రతినెలా సక్రమంగా వేతనాలు అందని కారణంగా కూడా మొక్కల సంరక్షణ విషయంలో ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని లక్ష్మాపూర్, నాగిశెట్టిపల్లి, గోధుమకుంట, బండమదారం, శ్రీరంగవరం, కోనాయ్‌పల్లి, నూతనకల్, లింగాపూర్‌తండ, అలియాబాద్, మజీద్‌పూర్, ఎదులాబాద్, అంకుశాపూర్ గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న వర్కర్స్‌కు 4 నెలలుగా జీతాలు అందడం లేదు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు వారు వినతి పత్రం అందజేశారు. మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని పల్లె, పట్టణ వనాల్లోని మొక్కల సంరక్షణకు మున్సిపల్, పంచాయతీ శాఖలు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

396 పట్టణ, పల్లె ప్రకృతి వనాలు

హరితహారం కార్యక్రమంలో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 396 పట్టణ, పల్లె ప్రకృతి వనాలు ఉన్నాయి. జిల్లా పరిధిలోని 13 పురపాలక సంఘాల్లో 215 పట్టణ ప్రకృతి వనాలు ఉండగా, ఇందులో బోడుప్పల్ కార్పొరేషన్‌లో 18 పట్టణ ప్రకృతి వనాలు ఉన్నాయి. పీర్జాదిగూడలో 22, నిజాంపేటలో 15, జవహర్‌నగర్‌లో 6, దమ్మాయిగూడలో 18, దుండిగల్‌లో 42, ఘట్‌కేసర్‌లో 18, గుండ్లపోచంపల్లిలో 14, కొంపెల్లిలో 12, మేడ్చల్లో 9, నాగారంలో 15, పోచారంలో 18, తూముకుంటలో 8 పట్టణ ప్రకృతి వనాలు ఉన్నాయి. పురపాలక సంఘాలు వీటి నిర్వహణను చూసుకుంటోంది. ఐదు మండలాల్లోని 61 పంచాయతీల పరిధిలోని 200 ఎకరాల్లో 81 పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. శామీర్‌పేట మండలంలో 11, ఘట్‌కేసర్ మండలంలో 17, కీసర మండలంలో 11, మూడుచింతలపల్లి మండలంలో 17, మేడ్చల్ మండలంలో 22 పల్లె ప్రకృతి వనాలు (పార్కులు) ఉన్నాయి. వీటి నిర్వహణ సంబంధిత గ్రామ పంచాయతీ చూసుకుంటోంది. ఈ ప్రకృతి వనాలను డీపీఓ, డీఆర్డీఏ, మున్సిపల్ కమిషనర్లు, అటవీ శాఖ పర్యవేక్షిస్తోంది. వాస్తవానికి ప్రతి వార్డు/డివిజన్‌లో పట్టణ ప్రకృతి వనం ఏర్పాటు చేయాల్సి ఉండగా, కొన్నింటిలో సరిపడా స్థలాలు దొరకలేదు. విద్యాసంస్థలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో కూడా మొక్కలు నాటారు. కంచెలు ఏర్పాటు చేసి బోర్డులు కూడా పెట్టారు. కొన్ని పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల పరిధిలో ప్రకృతి వనాలు, పార్కులు పచ్చదనంతో కనిపిస్తుండగా, మరికొన్ని చోట్ల మొక్కలు ఎండిపోవడం, మాడిపోయి కనిపిస్తున్నట్లు స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. అలాగే, కాగితాల్లో చూపిన మొక్కలకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న మొక్కలకు పొంతన లేని పరిస్థితి నెలకొంది.

హరితహారంలో 4.92 కోట్ల మొక్కలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో హరితహారం కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు 4.92 కోట్ల మొక్కలు నాటారు. జిల్లాలో 2017–18 సంవత్సరంలో హరితహారంలో భాగంగా 46.91లక్షల మొక్కలు నాటగా, 2018–19లో 54.35 లక్షలు మొక్కలు, 2019–20లో 119 లక్షల మొక్కలు, 2020–21లో 70.43 లక్షల మొక్కలు, 2021–22 సంవత్సరంలో 57.50 లక్షల మొక్కలు, 2022–23 సంవత్సరంలో 63 లక్షలు మొక్కలు నాటారు.

సంరక్షణలో నిర్లక్ష్యం..

జిల్లాలో నాటిన మొక్కలను సంరక్షించడంలో మున్సిపల్, పంచాయతీ శాఖలకు చెందిన యంత్రాంగం విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎండలు మండిపోతున్న నేపథ్యంలో ప్రతిరోజూ మొక్కలకు నీళ్లు పట్టాల్సి ఉంది. కొన్నిచోట్ల బోర్లు పని చేయకపోయినా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. నీటి సదుపాయం లేనిచోట ట్యాంకర్లతో నీళ్లు పెట్టాల్సి ఉంది. ప్రకృతి వనాల సంరక్షణకు తగినంత సిబ్బందిని కూడా నియమించలేదు. కొన్నిచోట్ల మొక్కల నాటిన ఆనవాళ్లు పోయి తవ్విన గుంతలు, ఊతకర్రలే కనిపించడం సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శంగా నిలుస్తోంది. మరికొన్ని చోట్ల ఎండిన మొక్కల స్థానంలో కొత్తగా నాటినా సంరక్షణ లోపంతో ఎండిపోతున్నాయి. పచ్చని పార్కులతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని ఆశించినా.. స్థానికులకు నిరాశే ఎదురవుతోంది.

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

ఘట్‌కేసర్: మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఫైన్ ఆర్ట్స్ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ మాధవీలత తెలిపారు. సంస్థ వెబ్‌సైట్‌లో ఈనెల 18లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 26 నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని, వచ్చే నెల 2న పరీక్ష ఉంటుందన్నారు.

నేడు కీసరలో తైబజార్ వేలం పాట

కీసర: కీసర పంచాయతీ పరిధిలో వారాంతపు సంతకు సంబందించి తైబజార్ రుసుము వసూలు చేసేందుకు శనివారం ఉదయం 10 గంటలకు కీసర గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు కీసర గ్రామకార్యదర్శి గంగన్న తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే వేలం పాటలో పాల్గొనేవారు శనివారం ఉదయం 9 గంటల వరకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తు ప్రతం తీసుకోవడంతో పాటు వేలం పాటలో పాల్గొనేందుకు రూ 50 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏడాది వరకు కీసర వారాంతపు సంతలో తైబజార్ రుసుం వసూలు చేసుకోవచ్చన్నారు.

నీటి ఇబ్బందులు వస్తే ఫోన్ చేయండి

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో వేసవి కాలంలో నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ఫోన్ చేయాలని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో నీటి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఎవరికైనా నీటి సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. కంట్రోల్ రూం ఫోన్ నంబర్లు 73960 98122, 98483 92302.

శివాజీ విగ్రహం ధ్వంసం

మేడ్చల్: తహసీల్దార్ కార్యాలయ సమీపంలో బొడ్రాయి ఎదురుగా ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. కటిక సంఘం ఆధ్వర్యంలో గతంలో దిమ్మె ఏర్పాటు చేసి ఇటీవలె శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు విగ్రహాన్ని ధ్వంసం చేశారు. దుండగులను శిక్షించాలని హిందూ సంఘాల ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు.



మేడ్చల్‌లో ధ్వంసమైన శివాజీ విగ్రహం



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న హిందూ సంఘాల సభ్యులు

గెలిచి మోదీకి బహుమతిగా ఇవ్వాలి

కుత్బుల్లాపూర్: దేశ ప్రధాని నరేంద్ర మోదీని మూడోసారి గెలిపించాలని... మల్కాజ్‌గిరిలో తనను గెలిపించి మోదీకి బహుమతిగా ఇవ్వాలని ఈటల రాజేందర్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. సూరారం టీఎస్‌ఐఐసీ కాలనీ, గాజులరామారం ఉషోదయ కాలనీల్లో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లు, వాణీనగర్ మోదీ అపార్ట్‌మెంట్స్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు గాలం వేస్తున్నారని అన్నారు. తన స్వార్థం కోసం వలసలను ప్రోత్సహిస్తున్నాడన్నారు. నరేంద్ర మోదీ 11వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను ఐదో స్థానానికి తీసుకొచ్చి చూపించారు. భారత దేశమే కాదు ప్రపంచ దేశాలు మోదీ వైపు చూస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ తమ బలమైన ఉత్తరప్రదేశ్ స్థానాన్నే కోల్పోయిందన్నారు.



మాట్లాడుతున్న మాల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్

అందుకే రాహుల్‌గాంధీ అక్కడ గెలవలేక కేరళకు వచ్చి పోటీ చేస్తున్నారని ఆరోపించారు. మల్కాజిగిరి నుంచి తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ప్రజలకు సేవ చేసుకుంటానని అన్నారు. కేంద్ర నిధులతో పార్లమెంట్‌లోని అన్ని నియోజకవర్గాలను అభివృదద్ధి చేస్తానన్నారు. నాయకులు, కార్యకర్తలు బీజేపీ జెండా ఎగురవేసే విధంగా పని చేయాలని సూచించారు.

బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం



జవహర్‌నగర్ చౌరస్తాలో మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షులు మండల సురేందర్ ఆధ్వర్యంలో..



నాగారంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తదితరులు



తుర్కపల్లిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మేడ్చల్‌లో బాబుజగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంత్యోత్సవాలను అన్ని ప్రాంతాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, సమతావాదిగా ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు అభివర్ణించారు. అన్ని పార్టీల నాయకగణం, ప్రజలు ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి, దళిత సంక్షేమానికి ఆయన చేసిన సేవలను పలువురు కీర్తించారు. కులరహిత సమాజం కోసం, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు బాబుజగ్జీవన్‌రామ్ అని కొనియాడారు.

– మేడ్చల్ జోన్ బృందం



చీర్యాల చౌరస్తాలో..



ఘట్‌కేసర్‌లో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు



అవుషాపూర్‌లో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

తుక్కుగూడ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్: రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలంటే రాష్ట్రంలోని అన్ని ఎంపీ స్థానాలను కైవసం చేసుకోవాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. తుక్కుగూడలో శనివారం నిర్వహించే జన జాతర బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన నియోజకవర్గ నేతలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం అన్ని డివిజన్లలోని ముఖ్యనేతలతో సన్నాహక సమావేశాలను నిర్వహించారు. ప్రతి డివిజన్ నుంచి అభిమానులు, నాయకులు నేతలు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్యనేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన యువకుడి అరెస్ట్

మల్కాజిగిరి: ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైన యువతిని ప్రేమ పేరుతో మోసం చేయడమే కాకుండా లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరికి చెందిన పిట్ట రతన్‌కుమార్ అలియాస్ రతన్(22) కారు డ్రైవర్. సికింద్రాబాద్ తుకారాంగేట్ ప్రాంతానికి చెందిన ఓ యువతి ఇన్‌స్టాగామ్ ద్వారా పరిచయమైంది. ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. మల్కాజిగిరి మారుతీనగర్‌లోని ఓయో లాడ్జికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆమె గర్భిణి కావడంతో పెళ్లి చేసుకునేందుకు నిరాకరించడంతో మల్కాజిగిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి యువకుడిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

భూమిని నమ్ముకుంటే అభివృద్ధి

సినీ, మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డి

ఉప్పల్: ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సుప్రభాత్ హైట్స్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో మరో నూతన వెంచర్ సహర్ష్ ప్రవేశిక (సహర్ష్ ఇన్‌ఫ్రా) పేరుతో భువనగిరి ఆలేర్ రైల్వేస్టేషన్ సమీపంలో ప్రారంభిస్తున్నారు. ఈ సందర్భంగా బ్రోచర్‌ను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎంఎస్ నాయుడు, స్వర్ణ, ప్రముఖ నటి సుదీప్‌మారినా, రోహిత్ ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డితో కలిసి నగరంలో ఆవిష్కరించారు. అనంతరం శివారెడ్డి, ఎంఎస్ నాయుడు మాట్లాడుతూ భూమిని నమ్ముకుంటే అభివృద్ధి చెందుతారని అన్నారు. కార్యక్రమంలో సుధాకర్ చౌదరి, మహ్మమద్ ముసాదిక్, నందాసింహ, రామరాజు, ప్రియాంక లక్ష్మీ, రావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫాల పంపిణీ

మల్కాజిగిరి: సీఫెల్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రంజాన్ తోఫాల పంపిణీ శుక్రవారం జరిగింది. జీహెచ్‌ఎంసీ, జలమండలి, పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే సిబ్బందితో పాటు కాలనీలో ఉండే ముస్లింలకు విశ్రాంత సుబేదార్ సయ్యద్ ఖాదర్ ద్వారా రంజాన్ తోఫాలను పంపిణీ చేశామని అధ్యక్షుడు సుభాష్ తెలిపారు. కార్యక్రమంలో రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాంపరింగ్ సమగ్ర దర్యాప్తు చేయాలి

తెలంగాణ న్యాయవాదుల జేఏసీ

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో ఫోన్ ట్యాంపరింగ్‌కు పాల్పడిన వారిపై సమగ్ర దర్యాప్తు చేసి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర డీజీపీకి వినతి పత్రాలను సమర్పించామని జేఏసీ నాయకులు తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాసాయాదవ్, కన్వీనర్ బత్తుల కృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారవేత్తలు, సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, పౌరులపై కూడా ఫోన్ ట్యాంపరింగ్‌కు పాల్పడిన వారిపై సమగ్రంగా విచారణ జరిపించాలని కోరారు. ఆర్టికల్ 27 వ్యక్తిగత స్వేచ్ఛను దుర్వినియోగం చేయరాదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాంపరింగ్‌కు పాల్పడిందని ఆరోపించారు. రాష్ట్రంలో జరిగే 17 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. జేఏసీ నేతలు జి.విజయకుమారి, జి.రామారావు, అనురాధ, చిరంజీవి పాల్గొన్నారు.

నిరంకుశ పాలనకు చరమగీతం

ప్రొఫెసర్ కోదండరాం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పదేళ్ల నిరంకుశ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్(ఐఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి పదవీవిరమణ సందర్భంగా అభినందనసభ జరిగింది. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో అన్ని వ్యవస్థలు నష్టపోయాయని అందులో ఆర్టీసీ కూడా ఆర్థికంగా నష్టపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల ద్వారా ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకుంటుందని అభిప్రాయపడ్డారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, రాష్ట్ర నాయకులు ఆర్.డీ.చంద్రశేఖర్, మదర్‌డైరీ మాజీ ఎండి యుగేంధర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, అబ్రహం, గోపాల్, సాయిరెడ్డి, రాజిరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు.



ఆర్టీసీ యూనియన్ నాయకుడు రాజిరెడ్డి పదవీ విరమణలో ప్రొఫెసర్ కోదండరామ్